
కథ

# బోడిగుండు

తిరుమలశ్రీ



**"అమ్మా! తలుపు వేసుకో" అని చెప్పి బయటకు నడుస్తున్న కూతుర్ని చూసి, "ఏం పిల్లలే తల్లీ! నీ కాలు క్షణమైనా కుదురుగా వుండదు గదా! మళ్లీ ఎక్కడికి బయలుదేరావే?" అంది పార్వత్తమ్మ.**

సబిత చిరునవ్వు నవ్వి, "మగపిల్లలు లేరని మొత్తుకుంటావు కదే అమ్మా! అందుకే ఆ ముచ్చట నేను తీర్చివేస్తున్నాను" అంది.

వెళుతూన్న పాతికేళ్ల కూతుర్ని చూస్తూ చిన్నగా నిట్టూర్చింది పార్వత్తమ్మ. 'పాపం ఆడపిల్ల... ఉద్యోగం కోసం అది పడని పాట్లు లేవు. తండ్రే బ్రతికుంటే ఈ పాటికి పెళ్లి చేసుకుని నీడపాటున సుఖంగా వుండవల్సిన మాట... ఆ భగవంతుడు మాకు ఎప్పటికి ఓ దారి చూపిస్తాడో ఏమో!' తనలో తానే గొణుక్కుంది ఆవిడ.

సబిత సిటీబస్ ఎక్కి సౌత్‌బీచ్ రోడ్‌లో దిగింది. పేవ్‌మెంట్ మీద మెల్లగా నడవసాగింది.

అలా నడుస్తుంటే ఆమె మదిలో ఆ రోజు పోస్ట్‌లో వచ్చిన ఉత్తరమే మెదులుతోంది. 'ఈ రోజు సాయంత్రం అయిదున్నరకు సౌత్‌బీచ్ రోడ్‌లో పేవ్‌మెంట్ మీద నడుస్తూ వుండు. ఓ రెడ్ కలర్ మారుతీకారు వచ్చి నీ పక్కకు ఆగుతుంది...'

ఆ ఉత్తరంలోని సంగతులు విచిత్రంగా ఉన్నాయి. దానిని ఎవరు రాశారో, ఎందుకు రాశారో తెలియదు. అందులో రాసినట్లు తు.చ. తప్పకుండా తాను పాటించవలసి వుంటుందట. అందుకు ఏమాత్రం భిన్నంగా జరిగిన తాను విచారించవలసి వుంటుందట!... ఆశ్చర్యం, అనుమానం వంతువేసుకుని ఆమెను పీడిస్తుంటే సాలోచనగా అడుగులు వేసింది ఆమె.



**దీపావళి కథల పోటీలో సాధరణ ప్రచురణకు ఎంపికైన కథ**

కొంతదూరం వెళ్లేసరికి ఎక్కణ్ణుంచి వచ్చిందో ఓ రెడ్ మారుతీ కారు వచ్చి సబిత పక్కకు ఆగింది. అందులో డ్రైవరు తప్ప ఎవరూ లేరు.

"మాడమ్! అర్థరాత్రి సూర్యోదయం" అన్నాడు డ్రైవర్ ఆమెకు మాత్రం వినిపించేట్లుగా.

"నో, పట్టపగలు చంద్రోదయం!" అని జవాబిచ్చింది తడుముకోకుండా.

అవి ఆ ఉత్తరంలో పేర్కొనబడ్డ కోడ్ వర్డ్స్!

"కూర్చోండి" అన్నాడు అతను కారు డోర్ తెరుస్తూ.

కారులో కూర్చున్నదామె.

మరుక్షణంలో కారు వేగంగా ముందుకు దూసుకుపోయింది.

కారులో కూర్చున్నదన్నమాటే గాని, సబిత గుండెలు కొట్టుకొంటున్నాయి. ఎవరో రాసిన లేఖననుసరించి తాను అంతటి దుస్సాహసానికి పూనుకుని వుండవలసింది కాదేమో! వాళ్లెవరో తెలియదు. తననే ఎందుకు ఎన్నుకున్నారో అసలే తెలియదు. ఏం చేయబోతున్నారో అంతకన్నా తెలియదు.

ఒకవేళ తనను కిడ్నాప్ చేయడానికది ప్లానేమో? కిడ్నాప్ చేసి. ఏం చేస్తారు? తాను ఏ సినీతారో, లేక ఏ ధనవంతుడి గారాల పట్టియో కాదే!... ఏ వేశ్యా గృహానికైనా అమ్మేస్తారా?? గుండె ఝల్లుమంది. అప్పటికప్పుడే కారులోంచి దుమికేయాలన్నంత భయం వేసింది.

ఉత్తరంలోని విషయాలు ఆమె బుర్రలో మెదిలాయి....

'కారులో కూర్చోగానే నీకు ఒక బ్రీఫ్‌కేస్ ఇవ్వబడుతుంది. నువ్వు దానిని ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి ఇవ్వాలో ఇన్‌స్ట్రక్షన్స్ కూడా ఇవ్వబడతాయి. ఆ ప్రకారం చేయవలసి వుంటుంది నువ్వు. ఏమాత్రం అజాగ్రత్తగా ప్రవర్తించినా, లేదా మోసం చేయాలని ప్రయత్నించినా కష్టాల పాలవుతావ్!'

అనేక సినిమాలలో చూసింది తాను. మాఫియాగాంగ్స్ అమాయకులను ఏదోవిధంగా తమ వుచ్చులో బిగించి తమ పనులు చేయించుకుంటారు. ప్రశాంతంగా వుండే వారి జీవితాల్లో చిచ్చు పెడతారు.

"మిస్‌సబితా!" అన్న అతని పిలుపుకు ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి బయటపడింది ఆమె.

"ఉత్తరం చదువుకుని నువ్వు వచ్చినందుకు నీ ధైర్యసాహసాలకు మెచ్చుకుంటున్నాను" అన్నాడతను.

"ఎవురు నువ్వు? ఏమిటిదంతా?" ప్రశ్నించింది సబిత.

"నో క్వశ్చన్స్ ప్లీజ్!" అన్నాడతను గంభీరంగా.

"నీకు ఇప్పుడొక బ్రీఫ్‌కేస్ ఇస్తాను. దానిని తీసుకుని నార్త్‌బీచ్‌రోడ్‌లో వున్న హోటల్ గ్రాండ్‌కి వెళ్లు. అయిదవ అంతస్థులో రూమ్ నంబర్ ఫైవ్ నాట్ వన్ నీపేరిట బుక్ చేయబడి వుంది. ఆ రూమ్ కీ ఇస్తాను. దానితో ఆ గదిలో ప్రవేశించు..." తాపీగా చెప్పుకుపోయాడతను. "రాత్రి సరిగా ఎనిమిదయ్యేసరికి ఓ వ్యక్తి వస్తాడు. తలుపుమీద ముమ్మారు ట్యాప్ చేస్తాడు. తలుపు తెరు. 'వైట్ టైగర్' అన్న కోడ్‌వర్డ్ చెబుతాడు. 'రెడ్ రోజ్' అని బదులివ్వాలి నువ్వు. అప్పుడతను లోపలకి వచ్చి నీకు ఓ చిన్న ప్యాకెట్ ఇస్తాడు. అతనికి నువ్వు బ్రీఫ్‌కేస్‌ను



## సల్మాన్‌తోనా... అయితే డేట్లు కుదరవు!

ఐశ్వర్యరాయ్‌తో ప్రేమ వ్యవహారం బెడిసిపోవడం, గతంలో జింకలను వేటాడిన కేసు, ఇపుడు తాజాగా కారు యాక్సిడెంట్ కేసు... స్వయంకృతాపరాధంతో ఒకదానిపై ఒకటి సమ్మెటపోటులా సమస్యల వలయంలో చిక్కుకున్న సల్మాన్‌ఖాన్‌తో నటించడానికి బాలీవుడ్ తారలు సైతం భయపడుతున్నట్లున్నారు కాబోలు. సల్మాన్‌ఖాన్ హీరోగా హాలీవుడ్ దర్శకుడు బిలియర్ట్ కైరీల్ తీస్తున్న 'మేరీగోల్డ్' చిత్రంలో నటించడానికి ప్రీతిజింటాను అడిగితే, డేట్స్ కుదరవని చెప్పిందట. ఇప్పటికే ఈ చిత్రం తాలూకు షూటింగ్ లాస్‌ఏంజిల్స్‌లో ప్రారంభమైంది. ఇందులో హాలీవుడ్ హీరోయిన్తో పాటు బాలీవుడ్ హీరోయిన్ అవసరం కూడా వుంది. సల్మాన్‌తో నటించడానికి ఏ హీరోయిన్ ముందుకొస్తుందో మరి! ఐశ్వర్యరాయ్ ఒప్పుకుంటుందా మరి...?

జె.

అప్పగించాలి. అతను వెళ్ళిపోయాక, ఓ అరగంటసేపు గదిలోనే వుండిపోవాలి నువ్వు. ఆ సమయంలో వచ్చి ఆ ప్యాకెట్‌ను తీసుకుంటాం మేము..."

"ఆ ప్యాకెట్‌లో ఏముంటుంది?" కుతూహలం ఆపుకోలేక చటుక్కున అడిగింది సబిత.

"ఆ వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నించకూడదు నువ్వు. అందువల్ల నీకే నష్టం" అని అతను అనడంతో నాలుక కరుచుకుంది.

"మిస్ సబితా! ఎనిమిదిగంటలకు హోటల్‌రూంలో నిన్ను కాంటాక్ట్ చేయబోయే వ్యక్తి సన్నగా, పొడవుగా వుంటాడు. వారంక్రితమే చేయించుకున్న బోడిగుండు. లైట్ బ్లూ సఫారీ డ్రెస్‌లో వుంటాడు. కాళ్లకు బ్రౌన్‌షూస్ వుంటాయి. కళ్లకు రిమ్‌లెస్ కళ్లద్దాలుంటాయి. ఈ ఆనవాళ్లు చాలు నువ్వు అతన్ని పోల్చుకోవడానికి, అవసరానికి మించి అతనితో మాట్లాడకూడదు. అత్యంత జాగరూకతతో మెలగవలసుంటుంది".

తల వూపిందామె. అతను అందించిన గ్రేకలర్ బ్రీఫ్‌కేస్‌ని తీసుకుంది. కొంచెం బరువుగానే అనిపించింది. అందులో ఏముందా అనుకుని ఆశ్చర్యపోయింది.... హఠాత్తుగా తాను చదివిన డిటెక్టివ్ నవలలు గుర్తుకు వచ్చాయి. ఆ బ్రీఫ్‌కేసులో నోట్లకట్టలున్నాయా? వాటితో తాను పారిపోతేనో?... అదే విషయం అతన్ని అడిగింది.

నవ్వాడతను. "డబుల్‌క్రాస్ చేసేవాళ్ల శవాలు సముద్రంలో జలచరాలకు ఆహారమవుతాయి" అన్నాడు కూల్‌గా.

ఆమె గుండె జలదరించింది. నవ్వడానికి ప్రయత్నిస్తూ, "నేను కొత్తదాన్ని కదా నన్ను నమ్మి ఈ బాధ్యతను నాకు అప్పగిస్తున్నారు మీరు. అందుకే అలా అడిగాను" అంది.

"నీ స్థితిగతులన్నీ మాకు తెలుసు. అందుకే నిన్ను ఎన్నుకోవడం జరిగింది" అన్నాడతను. "ప్యాకెట్‌ను నీ దగ్గరనుంచి కలెక్ట్ చేసుకునే సమయంలో నీ బహుమతి కూడా అందజేయబడుతుంది"

"ఇదిగో, ఈ పిస్టల్ కూడా దగ్గర వుంచుకో, అవసరమైతే వుపయోగపడుతుంది" అంటూ ఓ చిన్న పిస్టల్ని కూడా ఆమెకు అందించాడతను.

సబిత త్రుళ్లిపడడటం చూసి, "నువ్వు భయపడనవసరం లేదు. నీకు ఏ హానీ కలగకుండా మా మానుషులు కనిపెడుతూనే వుంటారు. ఒకవేళ అవసరమైతే ఆత్మరక్షణకు వుంటుందని దీన్ని ఇస్తున్నానంతే" అన్నాడతను. "నువ్వు ఎన్.సి.సి.లో రైఫిల్ షూటింగ్ నేర్చుకున్నావు కనుక దీనిని వుపయోగించడం కష్టం కాదు"

ఆశ్చర్యపోయింది సబిత. ఎన్.సి.సి. గురించి మాట్లాడుతున్నాడతను. తన పూర్తి వివరాలు వాళ్లు ముందే సేకరించారన్నామాట అనుకుంది. పైగా, తమ మనుషులు కనిబెడుతూంటారని కూడా అంటున్నాడు. తాను ఏదో విషవలయంలో చిక్కుకోవడం లేదు గదా? అనుకుని లోలోపలే భయపడింది... అమ్మకు చెప్పకుండా వచ్చింది తాను. ఒకవేళ తనకేమైనా జరిగితే అమ్మ ఏమయిపోతుంది?... ఓ క్షణం బేలగా అయిపోయిందామె. అంతలోనే తమాయించుకుంది. జరగుబోయే దాన్ని ఊహించుకుని ఆ సుడిగుండంలో అడుగు పెట్టింది తాను. అంతవరకు వచ్చాక వెనుదిరగడం అనవసరం. ఆ ఛాయిస్ తనకు వున్నట్టు కూడా లేదు. కానున్నది కాక మానదు. కమ్ వాట్ మే!... అనుకుని గుండె నిబ్బరం చేసుకుంది.

నార్త్‌బీచ్ రోడ్‌లో హోటల్ గ్రాండ్‌కి కొన్ని గజాల దూరంలో ఆమెను డ్రాప్ చేసి వెళ్లిపోయింది మారుతి కారు.

**000**

హోటల్ గ్రాండ్ ఫిఫ్త్ ఫ్లోర్‌లో లిఫ్టు దిగింది సబిత, రూమ్ నంబర్లు చూసుకుంటూ కారిడార్‌లో నడిచింది. నంబర్ ఫైవ్ నాట్ వన్ దగ్గర ఆగింది. వ్యానిటీ బ్యాగ్‌లోంచి అతడు ఇచ్చిన తాళం చెవి తీసి గది తలుపు తెరిచింది. లోపల ప్రవేశించి తలుపు మూసుకుంది.

ఏసీ రూమ్ అది. అప్పటికే ఏసీ ఆన్‌చేసి వుందేమో గదిలో చల్లగా వుంది. ఓసారి గదంతా పరిశీలనగా చూసిందామె.

ఖరీదైన ఫర్నిచర్‌తో అందంగా అలంకరింపబడివుంది గది. నేలపైన పరచిన తివాచీ మెత్తని పచ్చికలా అత్యంత మృదువుగా వుంది... తన జన్మలో అంతటి ఖరీదైన గదిగాని, ఫర్నిచర్‌గాని చూసి వుండలేదామె. ఒక క్షణం ఆమె డెందం ఆనందంతో వూగిసలాడింది. అంతలోనే తాను వున్న పరిస్థితి తలుపుకు రావడంతో వుత్సాహమంతా ఆవిరై పోయింది.

బ్రీఫ్‌కేస్‌ని, వ్యానిటీ బ్యాగ్‌నీ టీపాయ్ ముందుంచి ఫోమ్ బెడ్ మీద వాలిపోయిందామె. శరీరానికి హాయిగా అనిపించింది. కాసేపు అటూ ఇటూ దొర్లింది.

తరువాత వాచ్ చూసుకుంది. అయిదున్నరయింది. ఇంకో గంటసేపు తాను వెయిట్ చేయవలసి వుంటుంది ప్యాకెట్ కోసం.

ఆ రాత్రంతా అక్కడ గడపవున్నా హాయిగానే ఉంటుంది. చల్లగా నిద్రపోవచ్చును.


కాని, ఆ సుఖాన్ని అంటిపెట్టుకునివున్న ఎసైన్‌మెంట్ భయపెడుతోంది ఆమెను. ఎంతటి ధైర్యవంతురాలైనా ఏదో తెలియని భీతి, అశాంతి, అసంతృప్తి మదిలో ములుకుల్లా పొడుస్తున్నాయి.

కూడా తెచ్చుకున్న పేపర్ ప్యాక్‌ని బ్యాగ్‌లోంచి బయటకు తీసిందామె. సాధారణంగా ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం దగ్గర వుంటుంది. బోర్ కొట్టకుండా బస్‌స్టాప్‌లో సయితం చదువుకోడం అలవాటు ఆమెకు. అందుకే లెండింగ్ లైబ్రరీలో మెంబర్‌గా చేరింది.

బెడ్ మీంచి లేచి నిలువుటద్దంలో ఓసారి తన రూపం చూసుకుంది. చేతులతో ముంగురులు సవరించుకుంది. తరువాత ఇంటర్‌కమ్లో స్ట్రాంగ్‌కాఫీకి ఆర్డరిచ్చింది.

బేరర్ తెచ్చిన కాఫీ త్రాగి, బెడ్ మీద వాలి, పుస్తకం తెరిచింది. పుస్తకం చదువుతుంటే నిమిషాలు పరుగులు పెట్టడమే తెలియలేదు ఆమెకు.

హఠాత్తుగా తలుపుమీద మూడుసార్లు 'టక్, టక్'



మంటూ వినిపించడంతో ఫులిక్కిపడి వాచ్ చూసుకుంది.

ఎనిమిది గంటలయింది.

తడబడే అడుగులతో గుమ్మంవైపు నడిచింది.

అదిరే గుండెలతో తలుపు తెరిచింది.

సన్నగా, పొడవుగా వున్న ఓ వ్యక్తి గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు.

ఆమెను చూసి మందహాసం చేశాడతను.

ఆమె పక్కకు తప్పుకోవడంతో లోపలికి వచ్చి తలుపు దగ్గరా మూశాడు.

అతనివంక పరిశీలనగా చూసింది సబిత.

మనిషి తెల్లగా వున్నాడు. లైట్‌బ్లూ సఫారీ డ్రస్ ధరించాడు. కళ్లకు రిమ్‌లెస్ కళ్లద్దాలున్నాయి. కాళ్లకు బ్రౌన్ షూస్. నున్నటి బోడిగుండు లైట్ వెలుతురులో తళతళ మెరుస్తోంది. అతని గుండును చూస్తే 'షైనింగ్ డోమ్' గుర్తుకొచ్చి నవ్వొచ్చిందామెకు.

"వైట్ టైగర్!" అన్నాడతను ఆమె కన్నుల్లోకి సూటిగా చూస్తూ.

"రెడ్ రోజ్!" అని జవాబిచ్చిందామె.

సబిత బెడ్‌మీద కూర్చుంది.

"బ్రీఫ్‌కేస్ తెచ్చారా?" ప్రశ్నించాడతను.

తలూపిందామె.

"గివ్ మీ" అంటూ చేయి చాచాడు.

కూర్చున్న చోటు నుంచి కదలలేదామె. "ప్యాకెట్ ఎక్కడ?" అనడిగింది.

"ఓహ్!" అని నవ్వుతూ జేబులోంచి ఓ చిన్న ప్యాకెట్‌ని బయటకు తీశాడు. "ఇందులో దేశరక్షణకు సంబంధించిన అత్యంత రహస్య సమాచారంగల మైక్రోఫిల్మ్ వుంది. దీనిని అత్యంత భద్రంగా అందజేయాలి మీరు" అంటూ ఆ ప్యాకెట్‌ను ఆమె చేతిలో పెట్టాడు.

సబిత ప్యాకెట్ తీసుకుని వ్యానిటీ బ్యాగ్‌లో పెట్టుకుంది. ఆ బ్యాగ్‌ను వొళ్లోనే వుంచుకుంది. తరువాత వొంగి బ్రీఫ్‌కేస్ నందుకుని అతనికిచ్చింది.

"థాంక్యూ మేడమ్!" అంటూ బ్రీఫ్‌కేస్ నందుకుని లేచి నిలుచున్నాడతను.

"మీ తల...?" అందామె.

నవ్వాడతను. "ఇది తిరుపతి గుండు. వారం క్రితం తిరుపతి వెళ్లొచ్చాను" అన్నాడు గుండు తడుముకొంటూ.

సబిత కళ్లు అతన్నే చూస్తున్నాయి. ఆమె మస్తిష్కం మాత్రం ఏదో ఆలోచిస్తోంది.

అతను గుమ్మంవైపు అడుగు వేశాడు.

పరిస్థితిలో ఏదో అవాస్తవికతను, అసహజతను సబిత సబ్‌కాన్షస్ మైండ్ రికార్డు చేసింది. కాని, అదేమిటో స్పష్టం కావడం లేదు ఆమెకు.

అతనివంకే సాలోచనగా, తీక్షణంగా చూస్తోందామె.

డోర్ నాబ్ త్రిప్పబోతున్నాడతను.

అదే క్షణంలో...

"ఆగు.." అంటూ అరిచింది సబిత.

ఆశ్చర్యంతో వెనుదిరిగి చూసిన ఆ వ్యక్తి త్రుళ్ళిపడ్డాడు.

సబిత చేతిలో పిస్టల్ వుంది

అది అతనికి గురిపెట్టబడింది!

అంతలోనే తమాయించుకుని చిరునవ్వు పులుముకున్నాడు "మేడమ్! వాటీజ్ దిస్? వాట్ హాపెండ్?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఎవరు నువ్వు?" సూటిగా ప్రశ్నించిందామె, బెడ్ మీంచి కదలకుండానే.

"నేను... వెల్, పరిచయాలు అనవసరం... మనకు అప్పగించబడిన పనులు ముగిసాయి" అంటూన్న అతన్ని మధ్యలోనే కట్ చేసిందామె.

"ఐ నో యూ ఆర్ యాన్ ఇంపోస్టర్... టెల్ మీ మ్యాన్, హూ ఆర్ యూ?" కటువుగా అంది.

అతని ఆశ్చర్యం ఇనుమడించింది. "ఎందుకు వచ్చింది ఆ అనుమానం? కోడ్‌వర్డ్ కరెక్ట్‌గానే చెప్పానుగా?" అన్నాడు.

"ఎలాగో కోడ్‌వర్డ్ తెలుసుకున్నంతలో నన్ను మోసగించలేవు. మర్యాదగా ఆ బ్రీఫ్‌కేస్ అక్కడ పెట్టి చేతులు పైకెత్తు" అంది తీక్షణంగా.

తడబడ్డాడు. "మాడమ్! నేను అసలు వ్యక్తిని కానని ఎందుకనుకుంటున్నావ్?"

అన్నాడు బ్రీఫ్‌కేస్ క్రింద పెట్టకుండానే "డోంట్ బి సిల్లీ దీన్ని పర్యవసానం ఏమిటో ఆలోచించావా? మన పనులలో ఏమాత్రం జాప్యం జరిగినా ప్రమాదం!"

"షటప్!" అందామె లేచి నిలుచుంటూ... "బ్రీఫ్‌కేస్ కిందపెట్టు. డోంట్ ట్రై ఎనీ మంకీ ట్రిక్స్ విత్ మీ. నా అనుభవంలో నీలాంటి వాళ్లను చాలామందిని చూశాను" లోలోపల భయంగా వున్నా పైకి మాత్రం మేకపోతు గాంభీర్యంతో దబాయించింది సబిత.

ఆమె చెప్పినట్లే చేశాడతను. అతని వదనంలో ఆశ్చర్యం కొట్ట వచ్చినట్టు కనిపిస్తోంది.

"అలా గదిమూలకు జరుగు" పిస్టల్‌తో బెదిరిస్తూ ఆదేశించిందామె.

గదిమూలకు వెళ్లి నిలుచున్నాడతను, చేతులు పైకెత్తి.

"టెల్ మీ, నన్నెందుకు అనుమానిస్తున్నావు?" అని ప్రశ్నించాడు.

"నీ గుండు! అదే... బోడిగుండు..."

"నా గుండు కేమయింది?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నువ్వు తిరుపతి ఎప్పుడు వెళ్లానన్నావు?" ప్రశ్నించిందామె.


విస్తుపోయి చూశాడతను. "వారం క్రితం. ఈ గుండు కొండమీదే చేయించుకున్నాను" అన్నాడు

"ఔను. నీ గుండే నిన్ను పట్టించింది" అందామె.

"గుండు చేయించుకుని వారం రోజులయితే ఈపాటికి కొద్దిగా వెంట్రుకలు మొలకలయినా వచ్చేవి. కాని, నీ గుండు ఇప్పుడే గీయించుకుని వచ్చినట్టు అంత నున్నగా ఎలా వుంది?"

అప్రయత్నంగా చేత్తో గుండు తడుముకున్నాడతను. నున్నగా తగిలింది. ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని ఆమెనే చూస్తూ వుండిపోయాడు.

"ఇక రెండో కారణం... ప్యాకెట్‌ని నా కందిస్తూ అందులో ఏమున్నదీ వివరంగా చెప్పావు... నీలాగే నేనూ కేవలం కొరియర్‌ని నీకు తెలుసు. అందులో ఏముంది? ఒకవేళ నీకెలాగో తెలిసినా, ఏజెంట్స్ ఎవరూ అలా అతి వాగుడుకు పూనుకోరు..." చెప్పుకుపోయిందామె. "అంటే



నువ్విచ్చిన ప్యాకెట్ అయినా ఫేక్‌దయి వుండాలి, లేదా నువ్వయినా ఫేక్ ఏజెంటు వయ్యుండాలి..."

ఆమె రీజనింగ్ ఆలకించి నిర్ఘాంతపోయా డతడు. నోట మాట రాలేదు.

"నౌ టెల్ మీ మ్యాన్, ఎవరు నువ్వు?" తీక్షణంగా ప్రశ్నించింది సబిత.

"చెప్పకపోతే?" అన్నాడతను మొండిగా

"ఈ పిస్టల్‌లోని బులెట్స్ నీ బాడీలోకి ట్రాన్స్‌ఫరవుతాయి" అంది. "నేను మూడు లెక్కపెట్టే లోపున నీ వివరాలు చెప్పాలి!"

అతను నోరు మెదవకపోవడంతో "వన్..." అంది కౌంటింగ్ ఆరంభిస్తూ--

అతను మందహాసం చేశాడు.

"టూ..."

"అతను నోరు మెదపలేదు"

ఆమె 'త్రీ' అనబోతూంటే గది తలుపు భళ్లున తెరుచుకుంది.

"శభాష్, సబితా!" అన్న పలుకులతో వులిక్కిపడి గుమ్మంవైపు చూసిందామె.

గుమ్మంలో...

సాయంకాలం తనను మారుతికారులో అక్కడికి తీసుకొచ్చి బ్రీఫ్‌కేసిచ్చిన వ్యక్తి, మరో ఆజానుబాహుడు అయిన వ్యక్తీ ఉన్నారు!

వారిని చూడగానే, వారి దగ్గరకు వెళ్లబోయాడు బోడిగుండు వ్యక్తి.

"స్టే వేర్ యూ ఆర్!" అరిచింది సబిత అతడి నుద్దేశించి.

"మిస్ సబితా!" అన్నాడు బ్రీఫ్‌కేస్ ఇచ్చిన వ్యక్తి. "అతను ఇంపోస్టర్ కాడు, మన మనిషే!"


తెల్లబోయి చూసింది సబిత.

ఆమె వదనం చూసి గదిలో వ్యక్తులు ముగ్గురూ పెద్దగా నవ్వారు.

నొసలు చిట్లించిందామె.

"ఈ అమ్మాయిని ఇంకా సస్పెన్స్‌లో వుంచడం మంచిది కాదు. అసలు విషయం చెప్పేద్దాం" అని మూడవవ్యక్తి అనడంతో, బ్రీఫ్‌కేస్ ఇచ్చిన వ్యక్తి సబిత నుద్దేశించి, "అలా కూర్చో, సబితా! అంతా వివరంగా చెబుతాను" అని, ఇతర వ్యక్తులతో పాటు సోఫాలో కూర్చున్నాడు.

సబిత అయోమయంగా బెడ్‌మీద




చతికిలపడింది.

"సబితా! మేమెవరిమో తెలిస్తే మరింత ఆశ్చర్యపోతావు నువ్వు... నేను సెంట్రల్ ఇంటెలిజెన్స్ బ్యూరో ఆపరేషన్స్ డైరెక్టర్‌ని. ఈయన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్. ఇకపోతే ఈ బోడిగుండు ఓ ఇంటెలిజెన్స్ ఆఫీసర్..." మారుతీకారు డ్రైవ్ చేసి బ్రీఫ్‌కేస్ ఇచ్చిన వ్యక్తి చిరునవ్వుతో చెప్పుకుపోతూంటే, ఆశ్చర్యంతో అయోమయంతో నోరు తెరుచుకుని, వారు చూపించిన ఐడెంటిటీ కార్డ్స్‌ను చూసింది.

"సబితా! ఏడాది క్రితం మా డిపార్ట్‌మెంట్‌లో లేడీ ఆపరేటివ్ పోస్ట్‌కి అప్లై చేశావు నువ్వు. గుర్తుందా?" అడిగాడతను.

ఔనని తలూపిందామె.

"పర్సనల్ ఇంటర్వ్యూకి పిలిచేముందు క్యాండిడేట్స్‌కి ప్రాక్టికల్ టెస్ట్ ఎరేంజ్‌చేసే కొత్త పద్ధతిని అవలంబించాం మేము ఈమధ్య..." చెప్పుకుపోయాడతను. "నీకు ఆ లేఖ రావడము, ఈ ఆపరేషనూ అంతా నీకిచ్చిన టెస్ట్‌లో భాగం... ప్రాక్టికల్ టెస్ట్‌లో ఉత్తీర్ణురాలివయ్యావు నువ్వు...."

సబిత ఆనందానికి మేర లేకపోయింది.

"ఉత్తరం చూసి భయపడకుండా రంగంలోకి దిగి నీ ధైర్యసాహసాలను నిరూపించుకున్నావు నువ్వు. ఈ హోటల్‌కి రావడంతో నీ తెగువను చాటుకున్నావు. ఇప్పుడు బోడిగుండు ద్వారా నీ సూక్ష్మబుద్ధి, విశ్లేషణా శక్తి, అప్రమత్తతా రుజువయ్యాయి... వుయ్ రియల్లీ అప్రిషియేట్ యువర్ ఇంటెలిజెన్స్" అన్నాడతను.

"యూ ఆర్ సెలెక్టెడ్ ఫర్ ద పోస్ట్" అన్నాడు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.

"థాంక్యూ సార్! థాంక్యూ వెరీమచ్" అంది సబిత ఆనందంతో వుక్కిరిబిక్కిరవుతూ.

"కన్సీల్డ్ కెమెరా ద్వారా వక్కగదిలోంచి నీ ప్రతి కదలికా గమనిస్తున్నారు వీళ్లు. బగ్గింగ్ ద్వారా మన సంభాషణనంతా విన్నారు. అందుకే సమయానికి ఇక్కడికి రాగలిగారు" అన్నాడు ఇంటిలిజెన్స్ ఆఫీసర్, తలకు పెట్టుకున్న 'బోడిగుండు' విగ్‌ను తీసేస్తూ "ఎనీ మోర్ డౌట్స్?"

"అయితే ఈ బ్రీఫ్‌కేస్...?" సందేహంగా అందామె.

"తెరిచి చూడు" అని అతననడంతో, బ్రీఫ్‌కేస్ నందుకుని తెరిచిందామె.

దానినిండా పాత న్యూస్‌పేపర్ల కట్టలు స్టఫ్ చేయబడివున్నాయి!

నవ్వాగలేదామెకు. "అయితే మీరిచ్చిన ప్యాకెట్ కూడా ఫేక్ అయి వుండాలి!" అంది, వ్యానిటీ బ్యాగ్‌లోంచి దాన్ని పైకి తీస్తూ.

"అంతే కాదమ్మాయ్, నీ చేతిలో వున్న పిస్టల్‌కూడా!" అని ఆపరేషన్స్ డైరెక్టర్ అనడంతో చిన్నగా వులికిపడి పిస్టల్ వంక నమ్మలేనట్టుగా చూసింది.

అతను నవ్వి, "పేల్చి చూస్తే నీ అనుమానం తీరిపోతుంది" అన్నాడు.

సందేహిస్తూనే పిస్టల్ని గదిలో ఓ మూలకు తిప్పి షూట్ చేసిందామె. డమ్మీ బులెట్ పేలింది.

"అది డమ్మీ పిస్టలమ్మా!" అన్నాడు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, పొగవంక చూస్తూ.

"మిస్ సబితా! యూ మేక్ యాన్ ఎఫిషియంట్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్. కంగ్రాచ్యులేషన్స్!" అంటూ అభినందించాడు ఆపరేషన్స్ డైరెక్టర్, ఆమెతో కరచాలనం చేస్తూ.

"రేపు ఉదయం మా బ్యూరోకి రా. ఫార్మల్ ఇంటర్వ్యూకి ఎటెండయి ఎపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకుని వెళ్లు... విష్ యూ ఆల్ ద బెస్ట్!" అని ఆమెకు షేక్‌హ్యాండిచ్చాడు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.

లేచి నిలుచున్నారంతా.

వారికి 'థాంక్స్' చెప్పిందామె.

"నిన్ను మీ ఇంటి దగ్గర దిగబెడతాం, రా" అని వారనడంతో, ఎప్పుడెప్పుడు ఇంటివద్ద వాలదామా, ఆ శుభవార్త అమ్మ చెవిని వేద్దామా అన్న ఆత్రుతతో ఉల్లాసంతో గాలిలో తేలియాడే మనసుతో వారి ననుసరించింది సబిత. ■